
# పందెం

ఎమ్.కె. రావ్



నేనూ, మా ఎంకిగాడూ కలిసి కోటప్పకొండ తిరునాళ్ళ కెళ్ళాము. జనం విపరీతంగా వచ్చారు. ఇసుక వేస్తే రాలనట్టుగా ఉన్నారు.

రికార్డు డాన్సులు, సర్కసులు, కోలన్నలు, భజనలతో మహానందడి సందడిగా ఉంది.

"లే...లే... నా రాజా..." అంటూ జనాల్ని లేపుతూ, అర్ధనగ్న శరీరాలతో జనాలకు మత్తెక్కిస్తూ వచ్చి బూతు పాటల్ని పాడుతూ స్టేజీలను విరగతొక్కుతున్నారు డాన్సర్లు.

జనం ఈలలు వేస్తూ, చప్పట్లు కొడుతూ మహాదానందంతో ఒళ్ళు మరిచి చూస్తున్నారు.

ఒక చెరుకుగడని కొనుక్కుని నేనూ, ఎంకిగాడూ దాన్ని చెరిసగం విరక్కొట్టుకుని తింటూ ఓ డాన్సు చూస్తున్నాం-జనానికి కొద్ది దూరంలో నిలబడి.

మాకు ముందు ఒకతను నిలబడి ఉన్నాడు. అతని తల గుండు. వెంట్రుకలు దేవుడికి సమర్పించాడులా ఉంది. తల మీద రెండు మూడు గాట్లు ఉన్నాయి. ఆ గాట్లకి సున్నం వేసి ఉంది. మొత్తానికి గుండు వింతగా, విచిత్రంగా ఉంది.

అతను డాన్సు చూస్తూ, వాళ్ళు పాడే పాటలకు లయబద్ధంగా తల ఊపుతూ, ఈలలు కొడుతూ, ఎగురుతూ ఆనందిస్తున్నాడు.

అతని పోజ్ చూసిన నాకు చిన్న తమాషా చేయాలనిపించింది.

"ఒరేయ్ ఎంకా...చిన్న పందెంరా !" అన్నాను.

"పందెమా?" ఎగిరి గంతేశాడు వాడు.

మా ఎంకిగాడికి డబ్బులంటే ఎక్కడలేని ఆశ. చూస్తూ చూస్తూ ఓ పైసాని కూడా పోనివ్వడు. ఎక్కడైనా ఉచితంగా ఒక పైసా వస్తుందన్నా అది తెచ్చిందాకా నిద్రపోడు. డబ్బుకీ, వాడికీ అంత లంకె.

"ఎంత? ఇంతకీ నీ జేబులో ఎంతున్నాయి చెప్పరా బాబూ తొందరగా !" అంటూ వాడు గుక్క తిప్పుకోకుండా అడిగాడు.

"జేబులో ఎంతుంటేం గానీ, పందెం అయిదు రూపాయల్రా !"

"అయిదు రూపాయలేనా?" నిరాశగా అని "సర్లే, అవి మాత్రం ఎందుకు పోగొట్టుకోవాలి? పందెం ఏమిటో త్వరగా చెప్పిచావు !" అన్నాడు.

"ఏం లేదు. ఈ చెరుకుతో ఆ బోడిగుండుని గట్టిగా ఒక దెబ్బ కొట్టాలి."

"ఓస్... ఇంతేనా?" నిర్లక్ష్యంగా అంటూ వెళ్ళి చెరుకుగడతో గుండుమీద ఒక్క దెబ్బ వేశాడు.

వాళ్ళకి కొద్ది దూరంలో నిలబడ్డ నా కాళ్ళు మాత్రం వణికిపోతున్నాయి, ఏం జరుగుతుందో అని.

వీడు దెబ్బ కొట్టిన వెంటనే అతని పక్కకు వెళ్ళి భుజంమీద చేయి వేసి "ఏరోయ్ రామారావు, ను వ్వెప్పుడ్రా వచ్చింది?" అని అతని ముఖం చూసి ఫీలింగ్స్ మార్చి- "అయ్యో మీరా? నేను మా రామారావు అనుకున్నానండీ ! సారీ" అన్నాడు.

అతను గుండుమీద దెబ్బ పడినచోట నిమురుకుంటూ, రుసరుసలాడుతూ "పర్లేదులెండి !" అంటూ ఇంకొద్ది దూరం లోనికి వెళ్ళి నిలబడి, తిరిగి డాన్సు చూడటంలో లీనమైపోయాడు.

వాడి సమయస్ఫూర్తికి ఆశ్చర్యపోయాను. వాడు వెంటనే అయిదు రూపాయలు వసూలు చేసుకున్నాడు.

"ఒరేయ్, మళ్ళీసారి కొట్టావంటే పందెం పది రూపాయలు !" అన్నాను.

"అదెంతసేపురా?" అంటూ వాడు అయిదు నిముషాలు ఆగి, అతని దగ్గరకు వెళ్ళి మళ్ళీ చెరుకుగడతో టపీమని బాది "రామారావూ, ఇందాక నీలాంటి ఆయనేరా..." అంటూ ఆయన ముఖం చూసి "మీరు అక్కడ నిలబడి ఉన్నారే? మళ్ళీ ఇటు ఎప్పుడు వచ్చారు? మీ రనుకోలేదండీ...ప్లీజ్...మన్నించండి" అన్నాడు.

అతను చాలా కోపంగా, గుడ్లురుముతూ వీణ్ణి చూసి "స్నేహితులైతే మటుకు చెరుకుగడతో కొట్టి పలకరించాలా?" అని చాలా కోపంతోటి చీదరించుకుంటూ వెళ్ళి ఇంకో చోట నిలబడ్డాడు.

వాడు అప్పటికప్పుడే "అప్పు బేరాలు నా దగ్గర కుదరదు" అంటూ నా దగ్గర పది రూపాయలు వసూలు చేసుకున్నాడు.

నా డబ్బు సంపాయించుకోవాలనే పట్టుదలతో "మళ్ళీ కొట్టావంటే ఈసారి ఇరవై రూపాయలు" అన్నాను.

"ఒకే..." అంటూ వాడు వేరేచోట ఉన్న అతని దగ్గరకు వెళ్ళాడు. నేను అనుసరించాను.

వీడు చెరుకుగడ తీసుకుని ఆయన నెత్తిమీద వాత తేలేట్టుగా కొట్టి వెంటనే ముఖం చూసి "అయ్యో...చంపేశారండీ ! మళ్ళీ మీరేనా? మా రామారావూ, మీరూ అచ్చం ఒకేరకంగా ఉంటారు. అసలు వాణ్ణి తీసి పుట్టారు మీరు ! మీ ఇద్దర్నీ ఒకచోట నిలబెడితే కనుక్కోలేం ! మీ ఇద్దరికీ తేడాయే ఉండదండీ" అంటూ వాగుతూ అతన్ని మాట్లాడనివ్వలేదు.

ఆయన ముందు దీనంగా, తరువాత భయంగా, చివరికి కోపంగా వీణ్ణి చూశాడు. క్షణంలో ముఖంలో ఇన్ని రకాల ఫీలింగ్స్ వచ్చాయి.

నిండు చేతుల చొక్కాని చేతులు పైకి లాగి, మావాడి చొక్కా పట్టుకుని "ఎవడ్రా నువ్వు? మనిషివా, దున్నపోతువా? ఒళ్ళెం తిమ్మిరిగా ఉందా? తమాషా చేస్తున్నావా? నా కొడకా, మక్కెలిరగదంతాను ! ఇక్కడ నిన్ను తంతే నీయమ్మమొగుడు ఎవడూ అడ్డురాడు ! నేను పోనీలే అని వదిలిపెడుతుంటే వేషాలేస్తున్నావ్?" అంటూ నేను చెప్పరాని బండబూతులకు లేచాడు.

మావాడి పళ్ళు రాలిపోయా యనుకున్నాను. వీడు గజగజా వణికిపోతున్నాడు.

"అదుర్నాకొడకా ! ఎందుకురా అంత వణుకు? ఈసారి కానీ ఇలా జరిగిందంటే నీ ఎముకల్లో సున్నం ఉండదు !" బూతులతో పాటు హెచ్చరిక చేసి చొక్కాని ఒక్క లాగు లాగి వెనక్కి నెట్టాడు.

వీడు బతుకు జీవుడా అని మెల్లగా జారుకున్నాడు.

నాలో పట్టుదల పెరిగిపోయింది. అంతకు అంత సంపాయించాలి. వీడిని తెలివిగా దెబ్బ కొట్టాలి.

"ఒరేయ్ ఎంకా...ఈసారి పందెం ఏభై రూపాయలు. మళ్ళీ ఆయన గుండుని కొట్టాలి. కానీ ఒక షరతు. ఆయన చేత మాట అనిపించుకోగూడదు. ఆయన కోప్పడినా, తిట్టినా, కనీసం ఎందుకు కొట్టావ్ అని అడిగినా పందెంలో నీవు ఓడిపోయినట్లే !" అన్నాను.

"ఆహా ! ఈసారి ఏభై రూపాయలు. ఎంత ఛాన్సురా ఇవ్వాళ నాకు ! నిద్ర లేచి ఇవ్వాళ ఎంత మంచి ముఖం చూశానో !" అంటూ బయల్దేరాడు ఆ గుండుని జనంలో అన్వేషించటం కోసం. నేను అనుసరించాను.

"ఆయన ఈసారి వీణ్ణి విరగతన్నటం ఖాయం. పోనీ, తన్నకపోయినా ఇందాకటి మాదిరిగా బండబూతులు తిట్టకుండా వదిలిపెట్టడు. కనీసం చిన్న మాట అయినా అనకుండా ఎలా ఉంటాడు? ఈసారి వీడికి మూడినట్లే ! నా డబ్బు తిరిగి నాకు రాకుండా పోదు. వీడే పెద్ద తెలివి కలిగినవాడినని విర్రవీగిపోతున్నాడు" అనుకున్నాను మనసులో.

దాదాపు అరగంట తిరిగిన తరువాత అతను దొరికాడు. "అమ్మయ్య, నా డబ్బు ఎక్కడికీ పోదు అని ఆనందించాను.

వీడు మహోత్సాహంగా అడుగు ముందుకి వేశాడు. అతని వెనగ్గా వెళ్ళి, మళ్ళీ చెరుకుగడ విరిగేట్టు బాదాడు.

ఆయన ఇటు తిరిగేలోపలే ఆయన కాళ్ళమీద పడి, కాళ్ళు రెండూ వాటేసుకున్నాడు. "మళ్ళీ పొరపాటు జరిగిపోయిందండీ ! ఈ ఒక్కసారికీ మన్నించండి. మావాడూ, మీరూ ఒక్కలాగే ఉండటంతో ఈ తప్పు మళ్ళీ మళ్ళీ జరుగుతున్నది. పొరపాటు అంటున్నా కదా ! ఈ ఒక్కసారికీ క్షమించండి ! కాళ్ళు పట్టుకుని వేడుకుంటున్నాను." అని కళ్ళనీళ్ళ పర్యంతం అవుతూ, ఏడుస్తూ బ్రతిమలాడుకుంటున్నాడు.


ఆయన ఏమంటాడు? తప్పు చేశాను, మన్నించమని కాళ్ళు పట్టుకుని వేడుకుంటున్నాడాయె !

ఆయన కోపం చల్లారేవరకూ కాళ్ళు వదలకుండా తరువాత మెల్లగా లేచి, చల్లగా జారుకున్నాడు "వస్తానండీ !" అంటూ.

ఇక నేను నోరెత్తలేకపోయాను. వీడు ఎంతకైనా సమర్థుడే ! వాడికి ఏభై రూపాయలు చెల్లించేసరికి జేబు ఖాళీ అయిపోయాయి.

వాడి దగ్గరే తిరిగి చేబదులు తీసుకుని, డబ్బు పోయిన విచారంతో తిరుగుముఖం పట్టాను తెల్లారగట్ల.

★







# న్యాయ దర్శనం

## 'ప్రాజెక్టు వారే పరిహారం చెల్లించాలి'

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఏరియాలో ఉన్న గాలరీలకు ముఖద్వారం నిర్మించేపని ఒక కాంట్రాక్టరుకు అప్పగించారు ప్రాజెక్టువారు. ఆ కాంట్రాక్టరు కూలీలను పెట్టుకుని పని చేస్తున్నాడు. ఒక రోజు ఆడకూలీ శ్లాబ్ వేసిన చోట నీరుపోయడానికి అక్కడ వేసిన నిచ్చెన మీద కాలు పెట్టిందో లేదో కరెంటు షాకు తగిలి చనిపోయింది. ఆమె వయసు 19 సంవత్సరాలు. ఒక ఆడ పిల్ల, భర్త ఉన్నారు. ఆమె జీతం నెలకు రూ. 169-50.

పని చేస్తుండగా ప్రమాదం జరిగి చనిపోయింది కావున ఆమె భర్త మైనరు కూతురు తరఫున పరిహారం కొరకు వర్క్‌మన్స్ కంపెన్సేషను చట్టం క్రింద కాంట్రాక్టరు మీద, ప్రాజెక్టు అథారిటీ మీద కేసు పెట్టాడు.

తొందరగా పని కావాలన్నారు. మూడు షిఫ్టులు చేయమన్నారు. అందుకుకావలసి వెలుతురు సౌకర్యం అంతా ప్రాజెక్టు వారే ఏర్పాటు చేశారు. కరెంటుతో తనకు ఏ మీ సంబంధం లేదని, వారి ఏర్పాటు లోపం వలన కరెంటు లీక్ అయి, ఇనుప నిచ్చెనకు తాకిందని, ఆమె అది ఎక్కగానే షాకు తగిలి చనిపోయిందని, తన బాధ్యత ఏదీ లేదని కాంట్రాక్టరు వాదన.

పని అంతా కాంట్రాక్టరుకే అప్పగించాము కనుక ఏం జరిగినా అతనిదే బాధ్యత అని ప్రాజెక్టు వారి వాదన.

ఎలక్ట్రిక్ వైరు ఇన్సులేషను పోయిందని, దానికి ఆధారంగా ఉన్న స్తంభాలు కూడా పడిపోయినాయని, ఈ సంగతి కాంట్రాక్టరు అధికారులకు ముందుగా తెలియజేయలేదని అందువలన అతని నిర్లక్ష్యం వలన ప్రమాదం జరిగిందని అతనికి రావలసిన డబ్బులో నుండి రు. 16,800/- పరిహారం మినహాయించి, చనిపోయిన ఆవిడ కూతురుకు ఇవ్వమని ప్రాజెక్టు వారిని ఆదేశించింది. దాని మీద కాంట్రాక్టరు హైకోర్టుకు వెళ్ళాడు.

కాంట్రాక్టరు పనిలో పెట్టుకున్నా ప్రాజెక్టు వారే బాధ్యులని-కాంట్రాక్టరు కాదని అతనికి ఇచ్చే బిల్లుల నుండి పరిహారం సొమ్మును మినహాయించ కూడదని ప్రాజెక్టు వారే డబ్బు చెల్లించాలని తీర్పు చెప్పింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు.

-ఎమ్.ఎస్.శర్మ